# హార్ట్‌బీట్

"హాయ్!" అనే పలకరింపుకి పుస్తకం చదువుతున్న వాడల్లా చప్పున తలెత్తి చూశాడు ఋగ్వేద్.

పంజాబీ డ్రెస్ వేసుకొని ఎదుట వాలిన సీతాకోకచిలుకలా ఓ అందమైన అమ్మాయి.

బుక్ పక్కన పెట్టేసి "హలో!" అంటూ హుషారుగా విష్ చేశాడు.

ముద్దబంతి పువ్వులా నవ్వింది.

"యువర్ స్వీట్ నేమ్ ప్లీజ్..." అడిగాడు.

"నాట్ స్వీట్ నేమ్ ! జస్ట్ హాట్ నేమ్... అభిజ్ఞ" అంది చిలిపిగా నవ్వుతూ.

అతనికి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది.

ఆ అమ్మాయి నవ్వుతుంటే సొట్టలు పడి మెస్మరైజ్ చేస్తోన్న బుగ్గల వంకే చూస్తుండి పోయాడతను.

"మ్యాథ్స్ క్విజ్‌లో మీరు విన్నర్‌గా కాలేజ్‌లో ఫస్ట్ ప్రైజ్ కొట్టేసినందుకు కంగ్రాట్స్" తిరిగి తనే అభినందించిందతన్ని.

బదులుగా మౌనం వహించాడు. ఋగ్వేద్ బీ.యస్సీ. సెకండియర్ చదువుతున్నాడు.

ఫ్రిజ్‌లోంచి అప్పుడే తీసిన పెరుగుగడ్డలా... మంచుముత్యాల తడితో అరవిరిసిన మల్లెమొగ్గలా... ఫ్రెష్‌గా, ముద్దుగా ఉన్న అభిజ్ఞ అందం వంకే అలా మైమరచి చూస్తుండి పోయాడు.

"హలో మిమ్మల్నే! ఈ మధ్యే మీ ఎదురింటి డాబాలోకి అద్దెకి దిగాం. ఇంటర్ మ్యాథ్స్ ఫైనల్ చేస్తున్నాను. వాణీ కాలేజ్‌లో జాయినయ్యాను. జామెట్రీలో సర్కిల్స్‌కి సంబంధించి కొన్ని ప్రాబ్లమ్స్ ప్రాబ్లమ్‌గా ఉన్నాయి. కాస్త హెల్ప్ చేసి పెడతారేమోనని వచ్చాను"

కొత్త-పాత భేదం లేనట్టు ఆ అమ్మాయి గలగలా మాట్లాడేస్తుంటే ముచ్చటేస్తోంది ఋగ్వేద్‌కి.

చిలిపిగా పలకరిస్తున్నట్లున్న తేనెకళ్ళు... ఆపిల్ ముక్కల్లాంటి పెదాలు... పొడవాటి ముక్కు... వ్వావ్!? ఫ్రూట్ సలాడ్ అంచు మీద కదలాడే చెర్రీపండులా... బొద్దుగా ఎర్రగా ఎంత ముద్దుగా ఉందని?

ఋగ్వేద్ గుండె అడుగున ఓ తీయని అలజడి కెరటంలా లేచింది.

తనికి సమాధానమీయకుండా అతనలా పరధ్యానంగా ఉండటంతో ఏం మాట్లాడాలో తోచక, ముందున్న టీపాయ్ మీద అతను పడేసిన బుక్ ఏంటని తీసి చూసింది.

ఏదో డిటెక్టివ్ నవల!!

"అరే! మీరు నావెల్స్ కూడా చదువుతారా?" కనురెప్పల్ని టపటపలాడిస్తు ఆశ్చర్య పోయింది.

"ఏ?.. తప్పా?!" కనుబొమ్మలు ముడిచాడతను.

"చెత్త బుక్స్ చదివి విలువైన టైమ్‌ని వేస్టు చేసుకోవడమెందుకు? మ్యాథ్స్‌లో మీరంత జీనియసై వుండి ఇలాంటి బుక్స్ చదువుతూ మైండ్‌కి సైడ్ ఎఫెక్ట్ తెచ్చుకోవడ మెందుకు?" చనువుగా మందలించింది.

ఒక్క క్షణం ఆలోచన్లో పడ్డాడు. ఏమనుకున్నాడో ఏమో!

"నీకిష్టం లేదన్నావు కదా! ఇక నుండి మానేస్తాను సరేనా?" అన్నాడు ఆమె కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తూ.

సిగ్గుతో టక్కున తలొంచుకుంది అభిజ్ఞ.

"ఏదీ? ఆ మ్యాథ్స్ బుక్ ఇలా ఇవ్వు. నీ డౌట్స్ క్లియర్ చేస్తాను" చేయిచాస్తూ అన్నాడు ఋగ్వేద్.

మ్యాథ్స్ రీడర్‌ను అతని చేతికందించింది.

సబ్జెక్ట్‌లో లీనమైపోయారిద్దరు.

✤ ✤ ✤

రోజులు గడుస్తున్నాయి.

ఇద్దరి మధ్య చక్కటి స్నేహం కుదిరింది.

పచ్చని పట్టులంగా... మెరుస్తున్న తెల్లని వోణీ... బుగ్గల జాకెట్... తలనిండా పూలు... నుదుట తిలకం... కిందుగా ఎర్రని కుంకుమ... అచ్చు తెలుగింటి ఆడపడుచులాగా అందంగా ముస్తాబై... వెన్నెల కలువలా అభిజ్ఞ నడచి వస్తుంటే...

ఆ గజ్జెల సవ్వడికి -

నోట్స్ రాసుకుంటున్నవాడల్లా ఋగ్వేద్ చప్పున వెనుదిరిగాడు. చిర్నవ్వుతో విష్ చేసింది అభిజ్ఞ.

"కమాన్! రా...రా..." ఆహ్వానించాడతను. వచ్చి ఎదురుగా కూర్చుంది.

"సాయిబాబా గుడి నుండొస్తున్నాను. ఇదిగో ప్రసాదం." అంటూ కొబ్బరి ముక్క అందించింది.

కళ్లకద్దుకొని నోట్లో వేసుకున్నాడు.

కాస్సేపు ఇద్దరి మధ్య శబ్దం సిగ్గుతో మౌనం వహించింది.

"మీకు ఎయిత్ టేబుల్... ఐమీన్ ఎనిమిదో ఎక్కం తెల్సా?" అరచేతుల్ని బుగ్గలపై ఉంచి... కళ్లని అరమోడ్పుల్ని చేస్తూ అడిగింది.

ఆమె ఆటపట్టించడానికి అడుగుతుందని తెల్సినా "డిగ్రీ చదువుతున్నాను. అంత సింపుల్ టేబుల్ రాదా?!" కావాలనే చిరుకోపం ప్రదర్శించాడు.

"డోంట్ బి సీరియస్ మైడియర్ స్మార్ట్ గై! వస్తే చెప్పు చూద్దాం" అంది అతడ్ని ఉడికిస్తూ.

"టెస్ట్ చేస్తున్నావా?" ఉక్రోషం పెదాల మధ్య దాచాడు.

"నో...! నీలోని మ్యాథమెటీషియన్‌ని ఎలివేట్ చేస్తున్నాను" కళ్లని చక్రాల్లా తిప్పింది.

"అయ్యో పాపం! సరే ఏం చేద్దాం? అందమైన అమ్మాయి ఆర్డర్ పాస్ చేస్తే తప్పుతుందా?" అటూ భుజాలెగరేసాడు.

కిలకిల నవ్వింది అభిజ్ఞ.

ఋగ్వేద్ గొంతు సవరించుకొని -

"ఎయిట్ వన్ జా ఎయిట్... ఎయిట్ టూ జా సిక్స్టీన్...." అంటూ ఎల్‌కేజి స్టూడెంట్ టైపులో చేతులు కట్టుకొని మరీ బుద్ధిమంతుడిలా నిలబడి గడగడా అప్పచెప్పేసి కూర్చున్నాడు.

"వ్వె...వ్వె...వ్వె..." అని నాలికని పళ్లతో కొరుకుతూ వెక్కిరించింది.

"ఎందుకలా వెక్కిరిస్తావ్?" బుంగమూతి పెట్టాడు.

"ఎనిమిదో ఎక్కం వచ్చనుకుంటే నిజమేననుకున్నాను. వట్టి గ్యాసన్నమాట" అంది.

"ఆహా... అలాగే! అవున్నిజమేలే! నాకు రాదు. పోనీ తమరే చెప్పండి" వ్యంగ్యం ప్రదర్శించాడు.

"ఓడిపోయానని ఒప్పుకున్నట్టేగా?" అల్లరి చూపుల్తో ప్రశ్నించింది.

అందమైన ఆడపిల్ల ముందు బెట్టు చేయడమెందుకులే అనుకుని "ఇట్సోకే! నేనోడి పోయాన్లే" అని ఒప్పుకొన్నాడు.

"దట్స్ గుడ్! ఎనిమిదవ ఎక్కానికి మనిషి జీవన క్రమానికి దగ్గర సంబంధం వుంది" అంటూ ఆగిందొక్క క్షణం.

అభిజ్ఞ పెద్ద ఆరిందలా కొత్త విషయమేదో చెబుతోంటే ఆసక్తిగా వినసాగాడు ఋగ్వేద్.

చెప్పటం ప్రారంభించింది.

"ఎనిమిది ఒకట్లు ఎనిమిది...

**ఎనిమిదేళ్ల వయసు నుండి తల్లిదండ్రులు, గురువులు, పరిసరాల అనుకరణ నుండి మనిషి బయటపడి స్వంత అలవాట్లతో మెదలటం ప్రారంభిస్తాడు.**

ఎనిమిది రెండ్ల పదహారు...

**పదహారు సంవత్సరాల ప్రాయంతో వయసు యవ్వనాన్ని తొడుక్కుని నవ ప్రపంచంలోకి అడుగిడుతుంది.**

ఎనిమిది మూళ్ల ఇరవైనాలుగు...

**ఈ వయసులోనే మనిషి ఒక ఉన్నత లక్ష్యాన్ని ఎన్నుకునేది. ఆశయ సాధనకై నిరంతర కృషి సల్పేది.**

"ఎనిమిది నాలుగుల..." అంటూ ఏదో చెప్పబోయింది.

ఇంతలో "ఋగ్వేద్... బాబూ ఋగ్వేద్..." అంటూ వరండాలోంచి గొంతు విన్పించేసరికి చప్పున ఆపేసింది అభిజ్ఞ.

"అమ్మో! మీ డాడీ వచ్చినట్లున్నారు. నే మళ్లీ కలుస్తాను" అంటూ దిగ్గున లేచి గబగబా నడక సాగించింది.

"ఇలా పరికిణీ మీద రెండు జడలతో ఎంత బావున్నావో తెలుసా? ఐ లైక్ యూ వెరీ మచ్. నీకు రెండు జడలు చాలా బావుంటాయి" గొంతు తగ్గించి ఓ స్వీట్ కామెంట్ చేశాడు ఋగ్వేద్.

వడివడిగా వెళ్లిపోతున్న అభిజ్ఞ చప్పున తల వెనక్కి తిప్పి చిలిపిగా కళ్లు చిలికించింది. నాలుక బయట పెట్టి "వ్వె...వ్వె... ముద్దు" అంటూ గలగల గోదారిలా కదిలిపోయింది.

తండ్రి మళ్లీ పిలిచేసరికి కంగారుగా "వస్తున్నా డాడ్!" అంటూ అక్కడి నుండి కదిలాడు ఋగ్వేద్.

✤ ✤ ✤

"విష్ యూ హాపీ బర్త్ డే!" విష్ చేస్తూ ఋగ్వేద్ గదిలోకి అడుగిడింది అభిజ్ఞ.

అతడికిష్టమని రెండుజడలు వేసుకొని వచ్చింది. ఆ విషయం గమనించాడతను.

బదులుగా "వెల్‌కమ్ టు యూ!" అంటూ ఆహ్వానం పలికాడు.

చిలిపిగా నవ్వుతూ అతని ముందు కూర్చుంది.

"ఎలా ఉన్నానీ రోజు?" చూపుడు వేలితో తనని తాను చూపుకుంటూ అడిగాడు.

ఓరకంటితో చూసిందతనివైపు.

తలచుట్టూ స్మాల్ కటింగ్‌తో... ముందు నుదురుని తాకుతోన్న ముంగురులతో... నూనూగు మీసాల ఋగ్వేద్... స్మార్ట్‌గా ఆగుపించాడు.

క్రీమ్ కలర్ ఆక్సెంబర్గ్ టీ షర్ట్, స్కిన్ టైట్ బ్లాక్ కిల్లర్ జీన్స్ వేసుకొని స్టైల్‌గా అతను ఫోజిచ్చి నిలబడేసరికి-

"సూపర్... కత్తిలా ఉన్నావు" అంది కళ్లెగరేస్తూ.

అతనేదో అనేంతలో "అవునూ... బర్త్‌డే పార్టీ అని చెప్పావ్? మీ ఫ్రెండ్స్ హడావుడి... పార్టీ హంగామా ఏదీ లేదేం?" సందేహం వెలిబుచ్చింది.

"ఈ ఇయర్ ఎవర్నీ పిలవలేదు. ఈ పార్టీ ఓన్లీ ఫర్ యూ... కేవలం నీకోసమే!" అన్నాడు.

సిగ్గుల మొగ్గయ్యిందా అమ్మాయి.

తిరిగి కంటిన్యు చేస్తూ "బికాజ్ ఐ లైక్ యూ... అండ్ ఆల్సో ఐ...ల...వ్...యూ!!" ట్రాన్స్‌లో ఉన్నవాడిలా చెప్పుకుపోతున్నాడతను.

సర్రున తలెత్తింది.

"యూ షటప్!" గొంతెత్తి అరిచింది.

'స్టన్' అయిపోయాడు ఋగ్వేద్.

"కొద్ది రోజుల పరిచయం స్నేహంగా మారితే... ఆ ఆకర్షణకి ప్రేమ ముసుగు తొడుగుతావా? ఐ హేట్ యూ!

**ప్రేమ పేరిట కాలయాపన చేసే బదులు బుద్ధిగా చదువుమీద ధ్యాస పెట్టొచ్చుగా!**

ఈసారి ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్‌లో నీ మ్యాథ్స్ సబ్జెక్ట్ ఎంత దిగజారి పోయిందో? సిగ్గులేదూ!"అంటూ కోపంగా వెళ్లిపోయిందక్కడి నుండి.

ఓ భావకెరటం నిలువునా చీలి ఋగ్వేద్ ముఖం మీద చెల్లున చరిచినట్లయ్యింది. ఊహించని ఆ సంఘటనకి శిలా విగ్రహంలా బిగుసుకు పోయాడు. మొదటిసారిగా అతని గుండె మంచుముద్దైపోయింది.

ఆ సంఘటన జరిగాక అభిజ్ఞ కుటుంబం ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. వీధి విడిచి కాదు. ఏకంగా ఊరు వదిలి!

అది తెలిసి అభిజ్ఞ కోసం ఋగ్వేద్ పిచ్చివాడిలా వెతికాడు. అయినా వాళ్ల ఆచూకీ దొరకలేదు.

ఋగ్వేద్ ఆమె ధ్యాసలోనే... ఆమె జ్ఞాపకాల్లోనే... ప్రతిక్షణం వేదనతో గడిపినా... కొన్ని రోజుల్లోనే తేరుకున్నాడు.

'తాను బాగా చదవడమే అభిజ్ఞ కోరిక కదా!' అని మనసుని నిగ్రహించుకొని తిరిగి చదువుమీద పడ్డాడు.

✣ ✣ ✣

ఆరు సంవత్సరాలు గడిచాయి.

హైద్రాబాద్ వెళ్ళడానికి లగేజ్ సర్దుకుంటున్నాడు ఋగ్వేద్. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా అమెరికా వెళ్లబోతున్నాడతను.

"బాబూ ఋగ్వేద్! ఈ కవర్ తీసుకో... ఇల్లు ఖాళీ చేసే ముందు అభిజ్ఞ నన్ను కలిసి అన్ని విషయాలు మాట్లాడింది. చాలా తెలివైన పిల్ల. సమయం వచ్చినపుడే ఇది నీకివ్వాలని నాతో ఒట్టు వేయించుకుంది" అంటూ తండ్రి ఓ సీల్డ్ కవర్ ఇస్తుంటే.. వణుకుతున్న చేతుల్తో దాన్నందుకున్నాడు.

అభిజ్ఞ

ఎన్ని యుగాల క్షణాల అనంతరం ఈ పేరు మళ్లీ వినిపిస్తోంది?

ఒక అనుభూతి పవనం గుండె పొరల్ని ప్రకంపింప చేస్తోంటే... నెమ్మదిగా కవర్ విప్పాడు ఋగ్వేద్.

"నేస్తం-

నిత్యం నీపేరు స్మరించే నా హార్ట్‌బీట్ నీకెలా వినిపించను? నిన్ను ద్వేషిస్తున్నానని నీ బర్త్ డే రోజున నేనన్న మాటలకి నేనెంతగా కుమిలి పోయానని? నా హృది వేదన నీకెలా నివేదించను.

ఐ లవ్ యూ! ఐ లవ్ యూ!! ఐ లవ్ యూ!!!

ప్రేమలో పడి నీవు చదువుని అశ్రద్ధ చేస్తుంటే భరించలేకపోయాను. నిన్ను ఉన్నతుడిగా చూడాలనే తపనతో... అర్థాంతరంగా నిను వీడి నేను దూరంగా వెళ్లిపోయాను. ఎక్కడ ఉన్నా ఏమై పోయినా నీదానిగానే మిగిలిపోతాను. జన్మజన్మలకూ నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను.

ఇది నిజం...!

నీ అభిజ్ఞ"

కంపించే చేతుల్తో ఉత్తరాన్ని ముడుస్తూ-

"డాడ్! అభిజ్ఞ ఎక్కడ వుందో... చెప్పరూ? ప్లీజ్...!" తండ్రి చెంతకు పరుగెత్తి ఆతృతగా అడిగాడు ఋగ్వేద్.

తలొంచుకున్నాడాయన.

"చెప్పరేం?" నిలదీసి అడిగాడు.

"ఎక్కడికి వెళ్లేది చెప్పలేదు బాబూ! కానీ పసితనం నుండీ తన గుండెకి రంధ్రం ఉందని... అది వయసుతో పాటు పెద్దదవుతోందని... తను ఏ క్షణంలో నేల రాల్తానో తెలీదని.. అందుకే ఆచూకీ చెప్పకుండా వెళ్లిపోయింది బాబూ! పాపం ఆ అమ్మాయి ఇప్పటికి బ్రతికి ఉందో లేదో తెలీదు..." చెబుతుంటే ఆయన కంఠం ఆర్ద్రతా భరితమయ్యింది.

ఆ విషయం విని-

"నో...!" అని అరుస్తూ కుప్పకూలిపోయాడు ఋగ్వేద్.

అతడి హార్ట్‌బీట్ స్ప్లిట్ సెకండ్ స్తంభించి పోయింది.

**(03.11.2001)**

*